క్లుప్తంగా

విద్యుత్‌ బిల్లు చెల్లింపు ఇక సులభం



విద్యుత్‌బిల్లుపై విద్యుత్‌ శాఖ ఏర్పాటు చేసిన క్యూఆర్‌ కోడ్‌

దెందులూరు: విద్యుత్‌ బిల్లుల చెల్లింపు ఇక సులభతరం కానుంది. బిల్లుపై క్యూఆర్‌ కోడ్‌ విధానాన్ని తీసుకొచ్చినట్టు ఏలూరు ఏడీఈ త్రివాస్‌ తెలిపారు. రీడర్‌ తీసిన బిల్లుపై ఉన్న క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేసి సెల్‌ఫోన్‌ ద్వారా నగదు చెల్లించవచ్చని, ఈ అవకాశాన్ని ప్రతి వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అండర్‌ పాస్‌లో తొలగని నీరు



దెందులూరు- అలుగులగూడెం అండర్‌పాస్‌ వద్ద తొలగని వర్షపు నీరు

దెందులూరు: దెందులూరు – అలుగులగూడెం అండర్‌ పాసులోని వర్షపునీటిని తొలగించాలని, అండర్‌పాస్‌ పై కప్పు రెండో వైపు పనులు పూర్తి చేయించాలని ప్రజలు, వివిధ పార్టీల నాయకులు డిమాండ్‌ చేస్తున్నారు. కోట్లాది రూపాయలతో అండర్‌పాస్‌ నిర్మించి ఒక వైపు పై కప్పు ఏర్పాటు చేసి, అలుగులగూడెం వైపు పై భాగం ఏర్పాటు చేయలేదు. దీంతో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో రాకపోలకు విద్యార్థులు, రైతులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



విద్యార్థినికి బ్యాగు అందజేస్తున్న రంగరాజు

ఉంగుటూరు: నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల విద్యార్థులకు బుధవారం బ్యాగులు పంపిణీ చేశారు. కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ బీవీ శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మానవత మండల అధ్యక్షుడు రంగరాజు, రిటైర్డు పీడీ ఆదిరెడ్డి సత్యనారాయణ, గురువెల్లి రాజారావు, కొండారవి పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్యులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్‌ నత్తానియేలు

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో బుధవారం లయన్స్‌ క్లబ్‌ హేలాపురి ఆధ్వర్యంలో 160 మంది వ్యాయామ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు ప్రత్యూష, జీఎస్‌ ప్రసాద్‌లు సేవలు అందించారు. కానాల శ్రీనివాస్‌ 60 మంది విద్యార్థులకు రైటింగ్‌ ప్యాడ్‌లను అందజేశారు. లయన్స్‌ క్లబ్‌ సభ్యులను, వైద్యులను ప్రిన్సిపాల్‌ నత్తానియేలు సత్కరించారు.

ఆక్రమణ ప్రాంతం పరిశీలన

ఉంగుటూరు: గొల్లగూడెంలో భీముడు చెరువు నుంచి మోగల్లా చెరువు వరకు వరద నీరు ప్రవహించేందుకు ఏర్పడిన మురుగు బోదెను కొందరు రైతులు ఆక్రమించుకున్నారని మీకోసంలో వచ్చిన ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. ఇరిగేషన్‌ ఏఈ గాయత్రి, మండల సర్వేయర్‌ శ్రీనివాసరావు, వీఆర్వో, గ్రామ సర్వేయరు ఆక్రమిత ప్రాంతాన్ని పరిశీలించారు.

బస్సు పాసుల పంపిణీ



బస్సు పాసు అందిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరు: కొవ్వలి షాలేమో వృద్ధాశ్రమంలో నిర్వాహకులు ఏసోబు, ఎఫ్రాయేము, గ్రామ మాజీ సర్పంచ్‌ రత్నాంజలి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్గనైజేషన్‌ తరఫున ఆర్టీసీ ఉచిత బస్సు పాసులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌, ఉషా సంస్థల అధినేత డాక్టర్‌ వీవీ బాలకృష్ణారావు బుధవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.కోటితో కొవ్వలి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు (టూటౌన్‌): ప్రస్తుత సీజనల్‌లో ప్రబలే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తతతో ఉండాలని మున్సిపల్‌ హెల్త్‌ ఆఫీసర్‌ మాలతి సూచించారు. స్టాప్‌ డయేరియా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక 20వ డివిజన్‌ పరిధిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

దేశభక్తి భావాన్ని పెంపొందించుకోవాలి



భీమడోలు : భారీ త్రివర్ణ జెండాతో అధికారులు, ఉపాధ్యాయులు



నిడమర్రు : పెదనింద్రకొలను గాంధీ భవనం వద్ద నివాళులర్పిస్తున్న సర్వోదయ నేతలు, విద్యార్థులు

భీమడోలు: దేశభక్తి భావాన్ని విద్యార్థి దశ నుంచి పెంపొందించుకునేందుకు హర్‌ ఘర్‌ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో హర్‌ ఘర్‌ తిరంగా కార్యక్రమం రెండో రోజు బుధవారం ఘనంగా నిర్వహించారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో చిన్నారులు త్రివర్ణ జెండాను పట్టుకుని నినాదాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్‌, పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్‌, జి.నాగమణి, చిన్నారులు పాల్గొన్నారు.

త్రివర్ణ జెండా ఎగరాలి

ప్రతి ఇంటిలో, ప్రతి వ్యక్తి గుండెల్లో మూడు రంగుల జెండా ఎగరాలని భీమడోలు ఎంపీడీఓ సీహెచ్‌ పద్మావతి అన్నారు. భీమడోలు విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం హర్‌ ఘర్‌ తిరంగా కార్యక్రమంలో భాగంగా 150 అడుగుల జెండాతో భీమడోలు ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. తొలుత భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ ర్యాలీని ఎంపీడీఓ సీహెచ్‌ పద్మావతి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఈదుపల్లి శ్రీనివాసరావు, హెచ్‌ఎం అహ్మద్‌, సీసీఆర్‌టీ శరీన్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జల్లికొమ్మరలో హర్‌ఘర్‌ తిరంగా

గణపవరం: హర్‌ ఘర్‌ తిరంగా అభియాన్‌ యాత్ర బుధవారం జల్లికొమ్మర గ్రామంలో నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు జాతీయ జెండాలు, దేశనాయకుల చిత్రపటాలతో గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. స్థానిక యూపీ పాఠశాలలో పీఎం నరేంద్ర మోదీ సందేశాన్ని విద్యార్థులకు వినిపించారు. కార్యక్రమంలో యూపీ పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్‌ రామిశెట్టి నాగపాణి, హెచ్‌ఎం సుందర కుమార్‌, పి.సౌజన్య, ప్రసాదరావు, శ్రీదేవి, పార్వతి, సరస్వతి, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

సర్వోదయ మండలి ఆధ్వర్యంలో..

నిడమర్రు: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదారి జిల్లా సంర్వోదయ మండలి ఆధ్వర్యంలో బుధవారం పెదనింద్రకొలను గాంధీ భవనం వద్ద జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్‌ అందించారు. ఈ సందర్భంగా రిటైర్డ్‌ డీఈఓ, సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ దేశంకోసం పోరాడిన ప్రతి నాయకుణ్నీ నేటి తరం యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గ్రామంలో నాయకులు, విద్యార్థులు స్వేచ్ఛా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు సాగిరాజు జానకిరామరాజు, కె. సత్యనారాయణ మూర్తి, బంగార్రాజు తదితర గ్రామ పెద్దలు పాల్గున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో హర్‌ఘర్‌ తిరంగా

దెందులూరు: చిన్నారులకు ప్రాథమిక స్థాయి నుంచి జాతీయ భావం, జాతీయ నాయకుల పట్ల అవగాహన కల్పించాలని దెందులూరు క్లస్టర్‌ ఇన్‌చార్జి గారపాటి కొండయ్య చౌదరి, ఏలూరు జిల్లా బీసీ సెల్‌ జనరల్‌ సెక్రటరీ ఇప్పిలి వెంకటేశ్వరరావు అన్నారు. దెందులూరు 110 అంగన్‌వాడీ కేంద్రంలో హర్‌ ఘర్‌ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు జాతీయ జెండాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌ తోట ఏసమ్మ, ఉప సర్పంచ్‌ వేమూరి మురళీ, దెందులూరు సూపర్‌వైజర్‌ జె.చిట్టెమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.



గణపవరం : జల్లికొమ్మర గ్రామంలో విద్యార్థులు, గ్రామ పెద్దల ప్రదర్శన



భీమడోలు : లైబ్రరీ వద్ద నినదిస్తున్న చిన్నారులు



దెందులూరు : అంగన్‌వాడీ కేంద్రంలో హర్‌ఘర్‌ తిరంగా నిర్వహిస్తున్న దృశ్యం

కైకరంలో జన జాగరణ



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌

ఉంగుటూరు: స్వాతంత్య్రోద్యమ స్ఫూర్తితో కార్పొరేట్‌ కంపెనీల నుంచి వ్యవసాయ రంగాన్ని రక్షించుకోవాలని ఆంధ్రప్రదేశ్‌ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌ అన్నారు. అఖిల భారత కిసాన్‌ సభ పిలుపు మేరకు 78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్‌ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో కై కరం తూర్పువీధి రామాలయం వద్ద జన జాగరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు ఫలితంగా వచ్చిన స్వాతంత్య్రాన్ని పాలకులు తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని, దేశ సంపదను కార్పొరేట్‌ కంపెనీలు లూటీ చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌ రైతు సంఘం సీనియర్‌ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, ఆంధ్రప్రదేశ్‌ కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్‌ కౌర్ని అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

సొసైటీల రికార్డులు, రిజిస్టర్ల డిజిటలైజేషన్‌



గుండుగొలనులో కంప్యూటీకరణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పద్మావతి

భీమడోలు: ప్రాథమిక సహకార వ్యవసాయ సంఘాల్లోని రికార్డులు, రిజిస్టర్లు, ఇతర లావాదేవీల వివరాల కంప్యూటరీకరణ పనులు కొనసాగుతున్నాయి. జేసీ ధాత్రిరెడ్డి ఆదేశాల మేరకు కంప్యూటీకరణ పనులు చేసేందుకు సొసైటీ సిబ్బందికి డిజిటల్‌ అసిస్టెంట్లు, వెల్ఫేర్‌ అసిస్టెంట్లు సహాయకారులుగా నియమించారు. మండలంలోని గుండుగొలను, భీమడోలు, పూళ్ల సొసైటీల్లోని సభ్యులు, వారి నుంచి సేకరించిన సభ్యత్వాల నగదు, రుణ గ్రహీతలు, డిపాజిట్లు తదితర అంశాలపై డిజిటలైజేషన్‌ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ పనుల నిర్వహణను ఎంపీడీఓ సీహెచ్‌ పద్మావతి బుధవారం పరిశీలించారు. సమాచారాన్ని పారదర్శకంగా తప్పుల్లేకుండా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుల గడ్డ గుండుగొలను



23 మంది స్వాతంత్య్ర సమరయోధుల పేర్లను ముద్రించి ఉన్న గుండుగొలనులోని వేదిక

భీమడోలు: ఎందరో స్వాతంత్య్ర సమరయోధులకు జన్మస్థలం గుండుగొలను. ఈ గడ్డపై పుట్టిన 23 మంది స్వాతంత్య్రోద్యమంలో బ్రిటిష్‌ వారిని గడగడలాడించిన మహాయోధులు. వారి పేర్ల జాబితాను గుండుగొలను సంతమార్కెట్‌ వద్ద గల ఓ వేదికపై ఉన్న మహాత్మాగాంధీ విగ్రహంతో పాటు భారీ శిలాఫలకంపై ముద్రించారు. భోగరాజు, బందా, కొండ, మావులేటి మంగళంపల్లి, దుర్గంపూడి ఉనికిలి, ఉమ్మా, బొమ్మకంటి ఇంటి పేర్లు గల 23 మంది భారత స్వాతంత్య్రోద్యమంలో కీలక పాత్రను పోషించి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. బ్రిటిష్‌ వారు జైళ్లల్లో పెట్టిన చిత్ర హింసలకు ఆసువులు బాసినన వారూ ఉన్నారు. గుండుగొలనులో జన్మించిన భోగరాజు పట్టాభి సీతారామయ్య స్వాతంత్య్రోద్యమంలో కీలకపాత్రను పోషించి ఎన్నో తరాలకు ఆదర్శంగా నిలిచారు. ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకునిగా, ఎంపీగా, మహారాష్ట్ర గవర్నర్‌గా ఇండియన్‌ నేషనల్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడిగా పని చేశారు. గుండుగొలనుకు జాతీయ స్థాయిలోనే గుర్తింపు తెచ్చిన మహనీయుడు. వారిని స్వాతంత్య్ర దినోత్సవం నాడు మనమంతా స్మరించుకుందాం.

మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సూర్యచంద్ర రావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కలిగించాలని ఏలూరు జిల్లా స్పెషల్‌ ఎన్ఫోర్స్‌మెంట్‌ బ్యూరో అదనపు ఎస్పీ ఎన్‌ సూర్య చంద్రరావు అన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, వాటి గురించిన చట్టాలపై బుధవారం నగరంలోని కళాశాలల అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్‌తో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ముందుగా సరదాగా ప్రారంభమయ్యే ఈ మత్తు పదార్థాల వాడకాలు రాను రాను అలవాటుగా మారి వారి జీవన విధానాన్ని, నాడీ వ్యవస్థను కృంగతీస్తుందని వివరించారు. మాదక ద్రవ్యాలతో యువత మత్తు పదార్థాలకు బానిసై విలువైన జీవితాన్ని కోల్పోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్‌ ఎన్ఫోర్స్‌మెంట్‌ బ్యూరో ఇన్‌స్పెక్టర్‌ సీహెచ్‌ అరుణమ్మ, స్పెషల్‌ బ్యూరో ఎస్సై పి.శివప్రసాద్‌, ప్రభుత్వ ఆసుపత్రి సైకాలజిస్ట్‌ సీహెచ్‌ వంశీకృష్ణ, ఏసీహెచ్‌ ఎస్‌ బాబు, ఇంటర్మీడియట్‌ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర బాబు, పోలీసు అధికారులు 70 మంది కాలేజీ అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్‌ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సకల ప్రాణికోటి జీవించడానికి అవసరమైన గాలి, నీరు, ఆహారం, మంచి వాతావరణం లభించడానికి ఎంతో ముందు జాగ్రత్తగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ చేపట్టాలని సెయింట్‌ థెరిస్సా మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌ సిస్టర్‌ మెర్సి సూచించారు. స్థానిక సెయింట్‌ థెరిస్సా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె మొక్కలు నాటి ఎన్‌సీసీ క్యాడెట్లలో స్ఫూర్తి నింపారు. తమ కళాశాలలో 2024–25 సంవత్సరానికి ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్‌ మేజర్‌ పీఎం సెలిన్‌ రోజ్‌, 19 ఆంధ్ర బెటాలియన్‌కి చెందిన ఎన్‌సీసీ కమాండింగ్‌ ఆఫీసర్‌ కల్నల్‌ అమిత్‌ పాండే, అడ్మినిస్ట్రేటివ్‌ ఆఫీసర్‌ లెఫ్టినెంట్‌ కల్నల్‌ రిబేష్‌ పాల్గొన్నారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

నిడమర్రు: భూ సమస్యల పరిష్కారానికి ఈనెల 16 నుంచి వచ్చేనెల 4వ తేదీ వరకు గ్రామాల్లోని సచివాలయాల వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు నిడమర్రు తహసీల్దారు వై.శేఖర్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. సెక్షన్‌ 22ఎ వంటి ఇతర సమస్యల పరిష్కారానికి భూ యజమానుల నుంచి ఆర్జీలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. 16న అడవికొలను, 17న ఎనికేపల్లి, కాకరమిల్లి, నాగనమిల్లి, పెదరామచంద్రపురం, తిమ్మాపురం గ్రామాలకు అడవికొలనులో, 20న బావాయిపాలెం, 21న బువ్వనపల్లి ఆర్బీకే, 22న చానమిల్లి, సిద్ధాపురం, 23న దేవరగోపవరం, 24న చిననింద్రకొలను ఆర్బీకే, 27న క్రొవ్విడి, 28న విప్పర్తి కంద్రిక, గుణపర్రు, 30న నిడమర్రు, 31న పెందనింద్రకొలను, సెప్టెంబరు 4న తోకలపల్లి, బైనేపల్లి గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

నేడు హైస్కూల్‌లో విగ్రహాల ఆవిష్కరణ

దెందులూరు: స్థానిక గారపాటి హైమావతిదేవి స్కూల్లో గురువారం ఉదయం 9 గంటలకు సరస్వతి అమ్మవారి విగ్రహాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌, దాత గారపాటి హైమావతిదేవి విగ్రహాన్ని మద్దిపాటి సీతారామ్మోహనరావు ఆవిష్కరిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. పూర్వ విద్యార్థులు అందరూ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరుకావాలని వారు కోరారు.

ఇద్దరికి గాయాలు



రోడ్డు మార్జిన్‌లో పడిఉన్న మోటారు సైకిల్‌

ఉంగుటూరు: జాతీయ రహదారిపై నారాయణపురం – ఉంగుటూరు గ్రామాల మధ్య చిన్నకారు మోటారు సైకిల్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని హైవే అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. భీమడోలు నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళుతున్న చిన్నకారు ముందు వెళుతున్న మోటారు సైక్లిస్టును ఢీకొట్టింది. పూళ్లకు చెందిన ఎ.నాగార్జున, ఎ.సతీష్‌లకు గాయాలయ్యాయి. ఈ మేరకు కేసును ఎస్సై మణికుమార్‌ దర్యాప్తు చేపట్టారు.

చెస్‌ ప్లేయర్‌ ప్రేమి రక్షితకు సత్కారం

ఏలూరు (టూటౌన్‌): పదేళ్ల వయస్సులోనే స్కూల్‌, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి అండర్‌-10 చెస్‌ చాంపియన్‌ షిప్‌లు గెలుచుకున్న ఏలూరు తంగెళ్లమూడి ప్రాంతానికి చెందని చెస్‌ ప్లేయర్‌ ప్రేమి రక్షితను జిల్లా యాదవ సంఘం నాయకులు స్థానిక అమీనాపేట ఏటిగట్టు ప్రాంతంలోని జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ప్రస్తుతం అండర్‌-19 జాతీయ చెస్‌ చాంపియన్‌ షిప్‌లో పాల్గొనేందుకు సాధన చేస్తోన్న రక్షిత ఘన విజయం సాధించాలని నాయకులు ఆకాంక్షించారు. రక్షిత తండ్రి యడ్ల మహేష్‌ స్థానికంగా చెస్‌ చీఫ్‌ కోచ్‌గా వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం నాయకులు చిదరబోయిన శ్రీనివాసరావు, ఉక్కుసూరి గోపాలకృష్ణ, కిలారపు శ్రీనివాసరావు (బుజ్జి), గొర్ల రామారావు, ఆకుల గంగాధర్‌, బొట్టా అజయ్‌, చిట్టిబోయిన సాయిబాబు, కొలుసు కృపానందరావు, కొట్టి నాగభూషణం, పసుములూరి ప్రభు, తొందూరి అర్జున్‌, రక్షిత తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స

ఏలూరు టౌన్‌: ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని తలసేమియా భవనంలో బుధవారం 14 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స అందించారు. చికిత్స పొందుతోన్న చిన్నారులను ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్‌ చైర్మన్‌ బీవీ కృష్ణారెడ్డి పరామర్శించారు. రక్తదాతల సహకారంతో తలసేమియా, సికిల్‌ సెల్‌ ఎనిమియా బాధిత చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. సీనియర్‌ సిటిజన్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు మల్లినేని బెనర్జీ సహకారంతో బాధిత చిన్నారులు, వారి సహాయకులు 35మందికి భోజన సదుపాయం కల్పించామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్‌ కార్యదర్శి కేబీ సీతారాం, డాక్టర్‌ వరప్రసాదరావు, రెడ్‌క్రాస్‌ నర్సింగ్‌ స్కూల్‌ చైర్‌పర్సన్‌ బి.పద్మజవాణి, డాక్టర్‌ జి.స్పందన, ఏలూరు రోటరీ క్లబ్‌ ప్రెసిడెంట్‌ ఎన్‌జీవీబీ స్వామి, కార్యదర్శి ప్రసాద్‌, పీఆర్‌ఓ రమణ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ ఎంపిక కమిటీ సభ్యునిగా ఆర్‌ఎస్‌ఆర్‌

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులకు ఉన్నత విలువలతో పాటు వారిలో అభ్యసనా సామర్థ్యాలు పెంచి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయిలో అందించే ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఉపాధ్యాయులను ఎంపిక చేసే కమిటీ సభ్యునిగా నగరానికి చెందిన రాము సూర్యారావును నియమించారు. స్థానిక సీఆర్‌ఆర్‌ కళాశాలలో అధ్యాపకునిగా, అనంతరం ప్రిన్సిపాల్‌గా సేవలందించి ఆర్‌ఎస్‌ఆర్‌గా పిలువబడే సూర్యారావు గతంలో ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పని చేశారు.

చర్చలంటూ జాబితాల ప్రకటన సరికాదు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఒక వైపు ఉపాధ్యాయ సంఘాలతో చర్చలంటూనే మరో వైపు సర్దుబాటుకు సంబంధించిన మిగులు ఉపాధ్యాయుల జాబితాలు ప్రకటించడం సరికాదని ఏపీటీఎఫ్‌ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డి దొర ఒక ప్రకటనలో అసహనం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తరువాతే సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని కోరారు.

జాతీయ జెండాల పంపిణీ



దెందులూరులో జెండాలు పంపిణీ చేస్తున్న విద్యార్థినులు

దెందులూరు: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బీఆర్‌డీ నర్సింగ్‌ కళాశాల విద్యార్థులు 70 మంది ఐదు వేల జాతీయ జెండాలను పంపిణీ చేశారు. జాతీయ భావం పెంపొందించాలని, జాతిని ప్రేమించలేనివారు ఏ ఒక్కరిని ప్రేమించలేరని, తమ వంతు కర్తవ్యంగా జెండాలను పంపిణీ చేశామని వారు తెలిపారు.

జాతిపిత శంకుస్థాపన చేసిన గ్రంథాలయం



పోతునూరు గ్రంథాలయం

దెందులూరు: జాతిపిత మహాత్మా గాంధీ ఉప్పు సత్యాగ్రహం సమయంలో 1928లో పోతునూరు విచ్చేశారు. అదే రోజు ఇక్కడ గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ గ్రంథాలయంలో గాంధీ విగ్రహాన్ని పోతునూరు కోఆపరేటివ్‌ సొసైటీ మాజీ చైర్మన్‌ డీఎస్‌వీడీ ప్రసాద్‌ (బజ్జి) ఏర్పాటు చేశారు. బుధవారం గ్రంథాలయ అధికారి రాంబాబు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహిళల చొరవ అభినందనీయం

దెందులూరు: రాజధాని నిర్మాణానికి కొవ్వలి మహిళలు ఇంటింటా తిరిగి రూ.5 లక్షల 516 సేకరించడం అభినందనీయమని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో కొవ్వలి మహిళలు నగదును ఎమ్మెల్యేకు అందజేశారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

పెదపాడు : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సేవలందిస్తామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ అన్నారు. మండలంలోని వట్లూరు గ్రామంలో మీ కోసం మీ చింతమనేని కార్యక్రమంలో భాగంగా నెహ్రూ నగర్‌ కాలనీ, వట్లూరు గ్రామాల్లో బుధవారం ఇంటింటా తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు ఉప్పలపాటి రాం ప్రసాద్‌, ఎంపీడీఓ తేజరతన్‌ పాల్గొన్నారు.